సాక్షి
వరంగల్
సోమవారం । 30 । అక్టోబర్ । 2023



ఫిష్. భేష్
వ్యవసాయంతోపాటు చేపల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని మత్స్య శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.
- 12లో▸



ప్లాస్టిక్ వ్యర్థాలతో కళాకృతులు
ప్లాస్టిక్ వ్యర్థాలతో నల్లబెల్లి మండలంలోని కొండాపూర్ గ్రామస్తులు కళాకృతులు తయారుచేస్తున్నారు.
- 12లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/19^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

హాస్టల్ డిపాజిట్లు రెట్టింపు

- కేయూ అధికారుల తీరుతో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- వ్యతిరేకిస్తున్న విద్యార్థి సంఘాలు..
- తగ్గించకుంటే ఆందోళన తప్పదని హెచ్చరిక



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ తదితర కోర్సుల్లో అడ్మిషన్లకు గతంలోనే ఫీజులు భారీగా పెంచిన వర్సిటీ అధికారులు.. హాస్టళ్ల డిపాజిట్లను గతం కంటే రెట్టింపు చేశారు. ఈ విద్యాసంవత్సరం(2023–24) యూనివర్సిటీలో వివిధ కోర్సులకు అడ్మిషన్లు పొందిన విద్యార్థులు హాస్టళ్లలో వసతి, మెస్ సదుపాయం పొందాలంటే అందుకు సంబంధించి హాస్టల్ డిపాజిట్లు(డబ్బులు) చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్లను రెట్టింపు చేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ చర్యను వివిధ విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

డిపాజిట్ల పెంపు ఇలా..
గతంలో రెగ్యులర్ కోర్సుల్లో ఓసీ విద్యార్థులకు హాస్టల్ డిపాజిట్ రూ.6వేలు ఉండగా ఇప్పుడు రూ.12వేలకు పెంచారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల విద్యార్థులకు రూ.6,500 ఉండగా రూ.12,500, రెగ్యులర్ కోర్సుల బీసీ విద్యార్థులకు రూ.5వేలు ఉండగా రూ.10వేలు, ఎస్‌ఎఫ్‌సీ విద్యార్థులకు రూ.6వేలు ఉండగా రూ.12వేలు, రెగ్యులర్ కోర్సుల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.3వేలు ఉండగా రూ.8వేలు, ఎస్‌ఎఫ్‌సీ విద్యార్థులకు రూ.3,500 ఉండగా రూ.8,500, రెగ్యులర్ కోర్సుల పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.1,000 ఉండగా ఇప్పుడు రూ.6వేలకు, ఎస్‌ఎఫ్‌సీ పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.1,000 ఉండగా రూ.6వేలకు పెంచారు. ఇక పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సుల పరిశోధకులకు హాస్టల్ డిపాజిట్లు రూ.5వేలు ఉండగా ఇప్పుడు రూ.10వేలు చేశారు. అంతేకాకుండా హాస్టల్ వసతి కోసం చేసే అప్లికేషన్ ఫారం, మెస్‌కార్డుకు రూ.60 ఉండగా ఇప్పుడు రూ.200 చేశారు. లకు పెంపుదల చేశారు.

ఈ ఏడాది నుంచి హాస్టల్ వసతి
గత విద్యాసంవత్సరం పీజీ ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడ్డారు. సీపీగేట్‌లో అర్హత సాధించి కేయూలో పీజీ కోర్సు సీట్లు పొందిన విద్యార్థులకు ఈ ఏడాది నుంచి హాస్టల్ వసతి కల్పించనున్నారు. ఈ మేరకు రెండు దశల్లో సీట్లు పొందిన వారికి ఈనెల 30 నుంచి హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు హాస్టళ్ల డైరెక్టర్ వై.వెంకయ్య తెలిపారు. అలాగే బీఫార్మసీతో పాటు వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు కూడా కల్పిస్తున్నామని చెప్పారు.

డిపాజిట్ చెల్లిస్తేనే వసతి, మెస్‌సౌకర్యం
ఈ విద్యాసంవత్సరం(2023–24) హాస్టల్స్‌లో నూతనంగా వసతి పొందే అన్ని కోర్సుల విద్యార్థులు పెంచిన డిపాజిట్లు చెల్లించి వసతి, మెస్ సౌకర్యం పొందాల్సి ఉంటుంది. ఒకేసారి అంతమొత్తంలో డిపాజిట్లు పెంచడంపై విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పెంచిన డిపాజిట్ తగ్గించాలని ఇటీవల బీసీ విద్యార్థి సంఘం బాధ్యులు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వై.వెంకయ్యకు విన్నవించి వినతిపత్రం అందజేశారు. తగ్గించకుంటే ఆందోళన బాటపడుతామని హెచ్చరిస్తున్నారు.

మూడేళ్ల తర్వాతే పెంచాం..
గత మూడేళ్లుగా హాస్టళ్ల డిపాజిట్ రేట్లు పెంచలేదు. ఈ విద్యాసంవత్సరంలోనే పెంచాం. మిగతా యూనివర్సిటీలతో పోలిస్తే కేయూలో డిపాజిట్ రేట్లు తక్కువగా ఉన్నాయి. విద్యార్థులు హాస్టల్ అడ్మిషన్, వసతి, మెస్‌సౌకర్యం కోసం చెల్లించే ఈ డిపాజిట్ డబ్బులు తిరిగి కోర్సు పూర్తయ్యాక మెస్ బకాయిలు ఏమైనా ఉంటే మినహాయించి తిరిగి చెల్లిస్తున్నాం.
- వై.వెంకయ్య, కేయూ హాస్టళ్ల డైరెక్టర్

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

- వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్


రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఏసీపీ రఘుచందర్

వర్ధన్నపేట : ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్ పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని ఏబీఎస్ ఫంక్షన్ హాల్‌లో వర్ధన్నపేట డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఏసీపీ రఘుచందర్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. వివిధ ప్రమాదాలబారిన పడి దేశ వ్యాప్తంగా రక్తం దొరకక ఎంతోమంది మృతి చెందుతున్నారన్నారు. విలువైన ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. రక్తదాన శిబిరానికి యువత భారీ స్థాయిలో హాజరుకావడం అభినందనీయం అన్నారు. జఫర్‌గఢ్ ఎస్సైతో పాటు కానిస్టేబుళ్లు రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. శిబిరంలో సీఐ శ్రీనివాస్, వర్ధన్నపేట, రాయపర్తి, జఫర్‌ఘడ్ ఎస్సైలు ప్రవీణ్ కుమార్, విజయ్‌కుమార్, మహేందర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజ విషయాలపై రచనలు కొనసాగాలి


కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న కాత్యాయనీ విద్మహే తదితరులు

హన్మకొండ కల్చరల్ : సమాజంలో జరుగుతున్న విషయాలపై రచనలు కొనసాగించాలని పలువురు కవులు, రచయిత్రులు పేర్కొన్నారు. వరంగల్ శ్రీలేఖ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కవయిత్రి బిట్ల అంజనీదేవి రచించిన 'మనసెందుకో సున్నితం' తొలికవితా సంపుటిని ఆదివారం గవర్నమెంట్ ప్రాక్టీసింగ్ ప్రైమరీ స్కూల్ సెమినార్ హాల్‌లో ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు కాత్యాయనీ విద్మహే ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంజనీదేవి కవిత్వాలను పరిశీలిస్తే సామాజిక భావజాలం అర్థమవుతుందన్నారు. ప్రముఖ రచయిత్రి, కవయిత్రి అనిశెట్టి రజిత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో నిష్ణాతులుగా ఉండాలని అన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన కళావతి మాట్లాడుతూ కవిత్వం టైంపాస్ వ్యవహారం కాదని, ఒక దృక్పథంతో రచనలు చేయడమనేది ఆచరణ నుంచే సాధ్యమవుతుందని చెప్పారు. సంస్థ అధ్యక్షుడు టి.శ్రీరంగస్వామి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు పొట్లపల్లి శ్రీనివాసరావు, కొమర్రాజు రామలక్ష్మి, బిల్ల మహేందర్, ఉప్పలయ్య, అస్నాల శ్రీనివాస్ ప్రసంగించారు. పి.చంద్, డాక్టర్ బండారు సుజాత, వకులవాసు, గట్టు రాధిక, అనిత పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌ల నియామకం




హన్మకొండ: శాసన సభ ఎన్నికలకు బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లను నియమించింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, వర్ధన్నపేటకు రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లును నియమించారు. వీరు ఎన్నికల ప్రచారాన్ని పర్యవేక్షిస్తూ విజయానికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ శ్రేణులను సమాయత్తం చేస్తారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషిచేయాలి



పర్వతగిరి : కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు సూచించారు. ఈ మేరకు మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆదివారం కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆయన కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వడ్లకొండ ఎంపీటీసీ రేవతికుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు బాలరాజు, బూత్ కన్వీనర్ జుట్టుకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన మల్కాజ్‌గిరి వాసులు



గీసుకొండ : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా రావత్‌కోల్, నూతన్‌కోల్ గ్రామాలతోపాటు మెదక్ జిల్లా నుంచి మహిళా సంఘాల లీడర్లు ఆదివారం సందర్శించారు. ఎస్‌ఎం సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రాజెక్టు బాధ్యులు కె.వేమనారాయణ, సిబ్బంది జి.వెంకట్రావు, జి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధిని తెలుసుకున్నారు. జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి వారికి గ్రామ అభివృద్ధి, సాధించిన విజయాల గురించి వివరించారు.

పేకాట శిబిరంపై దాడులు



గీసుకొండ : గీసుకొండలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.10 వేల నగదు, నాలుగు బైక్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అల్లం బాబూరావు తెలిపారు. పేకాడుతున్న 8 మందిపై కేసులు నమోదు చేయాలని, తదుపరి చర్యల నిమిత్తం గీసుకొండ పోలీసులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఏసీపీ ఎ.మధుసూదన్ ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో ఆర్‌ఎస్‌ఐ బి. శరత్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాల్గొన్నారు.

మానుకోట.. చైతన్య బాట

- మొదటి నుంచి వైవిధ్య ఫలితాలే
- ఆరుసార్లు కాంగ్రెస్ విజయం
- టీడీపీ, బీఆర్‌ఎస్, సీపీఐ రెండేసి సార్లు..
- ప్రతి సారి వినూత్న ఓటింగ్
- అంచనాలకు అందని ఫలితాలు

జంగ్ తెలంగాణ

ఆర్థిక సహకారం అందాలి..

- జీవనోపాధి కోసం ప్రణాళిక ఉండాలి
- మహిళా సంక్షేమానికి మరింత కృషి చేయాలి
- 'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో కస్తూర్బా మహిళా పొదుపు సంఘం బాధ్యుల స్పష్టీకరణ

- వివరాలు 10లో▸

మూడోసారి ఆదరించాలి : అరూరి


వర్ధన్నపేట : కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్

వర్ధన్నపేట : మేనిఫెస్టో నచ్చడంతో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు స్వామితండాకు చెందిన పలువురు నాయకులు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే అరూరి రమేష్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రజలను నట్టేట ముంచుతాయన్నారు. రానున్న ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్యేగా తనను ఆదరించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో బానోత్ భావుసింగ్, పూలసింగ్, బిచ్యా, వెంకన్న, రవి, సోమ్లా, లకుపతి, భాస్కర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ స్వామి రాయుడు, సర్పంచ్ సంపత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వసంత్, వీరన్న, రాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి
పర్వతగిరి: బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. గోరుగుట్టతండా గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ రవి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం అరూరి రమేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయకుల మధ్య ఐక్యత లేకపోతే రాబోయే రోజుల్లో పార్టీకి నష్టం జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు కలిసి సమన్వయంతో పనిచేసి బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ బానోత్ మంజుల, రవికుమార్, పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు నెహ్రూ నాయక్, సోమ్లానాయక్, సుమన్, దేవేందర్, మోహన్, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

- పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి


నర్సంపేట : కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట మండలం నాగుర్లపల్లికి చెందిన 40 కుటుంబాలు, నర్సంపేట పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ విద్యార్థి యూత్ బాధ్యుడు వడ్నాల వంశీకృష్ణయాదవ్, నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

అడ్డబాట తండాలో..
చెన్నారావుపేట : గొల్లభామ తండా శివారు అడ్డబాట తండాకు చెందిన 25 కుటుంబాలు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి దొంతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాయి. క్లస్టర్ ఇన్‌చార్జ్, వర్కింగ్ ప్రెసిడెంట్, సర్పంచ్ సిద్ధన రమేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, బోడ స్వామి ఉన్నారు.

నందిగామలో..
నల్లబెల్లి : నందిగామకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, నాయకులు ఇస్తారి శేఖర్, మాలోత్ చరణ్‌సింగ్, జిల్లా మునేందర్, జెట్టి రామ్మూర్తి, జంగిలి మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గురిజాలలో..
నర్సంపేట రూరల్ : గురిజాలలోని టీడీపీ, బీఆర్‌ఎస్‌కు చెందిన 20 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. పార్టీ గ్రామ అధ్యక్షుడు గుర్రం అచ్చయ్య, ప్రధాన కార్యదర్శి డక్క శ్రీనివాస్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు గజ్జి రాజు పాల్గొన్నారు.

ఖానాపురంలో..
ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బొబ్బ విద్యాసాగర్‌రావు, జటంగి రాజ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్ల జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముస్తఫా, వెంకటప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

నర్సంపేట : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించాలని డీసీపీ రవీందర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణవేణి అన్నారు. ఈ మేరకు నర్సంపేట ఆర్డీఓ కార్యాలయంలో తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి అన్నారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రచారంలో అల్లర్లు జరిగే ప్రదేశాలపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడితే కేసుల పాలవుతారని, తద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఏసీపీ పుప్పాల తిరుమల్, సీఐలు పుల్యాల కిషన్, సుంకరి రవికుమార్, హతిరాంనాయక్ , తహసీల్దార్లు, ఎస్సైలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నరకాసుర వధ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


ఏసీపీ బోనాల కిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మరుపల్ల రవి

కరీమాబాద్ : ఎన్నికల కోడ్ నిబంధనల నేపథ్యంలో నరకాసుర వధ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ సూచించారు. 40వ డివిజన్ కార్పొరేటర్, నరకాసుర వధ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆదివారం ఏసీపీ కిషన్‌ను కలిశారు. వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మరుపల్లి గౌతం, దూడ కొమురెల్లి, మరుపల్లి శివ, తౌటం నర్సింహ, కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- స్వీప్ నోడల్ ఆఫీసర్ హరిప్రసాద్



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

హన్మకొండ: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ నోడల్ ఆఫీసర్ హరిప్రసాద్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని రాజాజీనగర్, రాంనగర్, కేఎల్ఎన్.రెడ్డి కాలనీ, గోకుల్‌నగర్, సమ్మయ్యనగర్‌లో కళాజాత బృందాలతో ఇంటింటికి వెళ్లి ఓటు హక్కు వినియోగం, నైతికతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చైతన్యవంతులు కావాలని, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని సూచించారు. ఓటు బ్రహ్మాస్త్రమని, దేశాన్ని ప్రభావితం చేసే శక్తి ఓటుకు ఉందని చెప్పారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ఓటు విలువ సమానమని, ఆ హక్కును దుర్వినియోగం చేయకూడదని కోరారు. ఈ నెల 31 వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశముందని, అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్ దగ్గర ఓటరు అసిస్టెంట్ బూత్‌ను ఏర్పాటు చేస్తామని, సందేహాలుంటే ఓటర్లు ఇక్కడ నివృత్తి చేసుకోవచ్చని వివరించారు. వంద శాతం ఓటు హక్కు వినియోగించుకుని పోలింగ్‌లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కోరారు.

నవంబర్ 3 నుంచి ఎస్ఈఏఎస్

- విద్యావ్యవస్థ తీరుతెన్నులను అంచనా వేసేందుకు సర్వే
- పాల్గొననున్న 580 మంది ఇన్వెస్టిగేటర్లు
- 3, 6, ,9 తరగతుల్లోని 12,427 మంది విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

కాశీబుగ్గ సెంటర్ : ఎస్‌సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో నవంబర్ 3 నుంచి జిల్లాలో ఎస్ఈఏఎస్ (స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే) నిర్వహించనున్నారు. 13 మండలాల్లోని 531 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9 తరగతులు చదువుతున్న 12,427 మంది విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన కోసం, విద్యావ్యవస్థ తీరుతెన్నులను అంచనా వేసేందుకు ఈ సర్వే చేయనున్నారు. ఈ సర్వేలో 580 మంది (ఎఫ్ఐఎస్) ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ పాల్గొంటారు. ప్రతి మండలానికి ఇద్దరు నుంచి నలుగురు చొప్పున బ్లాక్ లెవల్ కోఆర్డినేటర్లుగా ఎంఎన్ఓలు, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సేవలందించనున్నారు. జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారి, డైట్ ప్రిన్సిపాల్ జిల్లా కోఆర్డినేటర్లుగా, సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు, డైట్ లెక్చరర్స్ అనుబంధ కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు. ఇప్పటికే 3, 6, 9 తరగతి విద్యార్థులకు సెప్టెంబర్ 23, 27, అక్టోబర్ 3వ తేదీన ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించారు. ఈనెల 27న ఒక టెస్ట్ నిర్వహించారు. మిగిలినవి 31, నవంబర్ 2న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతిమ పరీక్ష జాతీయ, రాష్ట్ర స్థాయిలో నవంబర్ 3న నిర్వహిస్తారు.

సర్వేలో అధికారులు పాల్గొనాలి



స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేలో సంబంధిత అధికారులు అందరు పాల్గొనాలి. 3, 6, 9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు సర్వే నిర్వహిస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.
- డి.వాసంతి, డీఈఓ

ఎంజీఎం ఆస్పత్రికి అంబులెన్స్ బహూకరణ

- మర్కజీ పాఠశాలకు కంప్యూటర్ల అందజేత



అంబులెన్స్ తాళంచెవిని స్వీకరిస్తున్న ఆర్ఎంఓలు

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ ఆదివారం అంబులెన్స్‌ను బహూకరించారు. ఈమేరకు అంబులెన్స్‌కు సంబంధించిన పత్రాలను ఎంజీఎం ఆర్‌ఎంఓలు మురళి, ప్రసాద్‌కు అందించారు. అలాగే, ప్రభుత్వ మర్కజీ పాఠశాలకు రూ.5 లక్ష విలువగల కంప్యూటర్లను సైతం అందించినట్లు రాజేశ్‌కుమార్ పాటు తెలిపారు. కాజీపేటలోని సహృదయ వృద్ధాశ్రమానికి రూ.2లక్షల విరాళం అందించనున్నట్లు తెలిపారు. డీజీఎం వివేక్‌చంద్ర, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్


ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్న వాకర్స్ తదితరులు

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ మైదానంలో ఫిట్ ఇండియా ఫ్రీడమ్–4కే రన్‌ను ఆదివారం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్–56 బెటాలియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సీఆర్‌పీఎఫ్–58 బెటాలియన్ కమాండెంట్ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నడక ఆరోగ్యానికి ఔషధంగా పనిచేస్తుందని, ప్రతి నిత్యం వాకింగ్‌తో పాటు వ్యాయామం తప్పనిసరిగా చేయాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ తులసి, ఇన్‌స్పెక్టర్ లీనిష్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అండర్ రైల్వే జోన్‌లో 2 రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్ : ధర్మసాగర్ 60 ఎంఎల్‌డీ ఫిల్టర్ల వద్ద నిర్వహణ పనులు కొనసాగుతున్నందున సోమ, మంగళవారాల్లో అండర్ రైల్వే జోన్ పరిధిలో నీటి సరఫరా ఉండదని బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. బల్దియా అండర్ రైల్వే జోన్ పరిధిలోని కరీమాబాద్, పెరికవాడ, శివనగర్, రంగశాయిపేట, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాకరాశికుంట, ఎస్ఆర్ఆర్ తోట, ఏకశిలానగర్, కాశికుంట, ఖిలా వరంగల్, దూపకుంట, వసంతపురం, స్తంభంపల్లి, నక్కలపల్లి, లక్ష్మీపురం, భట్టుపల్లి, కడిపికొండ, రాంపూర్ నీటి సరఫరా ఉండదన్నారు.

నేటి కలెక్టరేట్ గ్రీవెన్స్ రద్దు


కరీమాబాద్: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని ఆమె సూచించారు.

గ్రేటర్ గ్రీవెన్స్..
వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం సమావేశాలు, అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు బల్లార్షా ప్యాసింజర్ రద్దు

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్‌డివిజన్ పరి ధిలో ప్రయాణించే బల్లార్షా–కాజీపేట(1703 6) వెళ్లే ప్యాసింజర్ రైలును దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం రద్దు చేశారు. ఈ మేరకు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. సెక్షన్‌లో సిగ్నల్ వ్యవస్థ అప్‌గ్రేడ్, మూడో రైల్వేలైన్ నిర్మాణం, రైల్వే ఇంజనీరింగ్ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మానుకోట.. చైతన్య బాట



ప్రజలను మోసం చేయడం కన్నా ఎన్నికల్లో ఓడిపోవడమే మేలు.

- స్టీవెన్‌సన్



తీగల సత్యనారాయణ, జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి, బండి పుల్లయ్య, శ్రీరామ్ భద్రయ్య



వేం నరేందర్‌రెడ్డి, మాలోత్ కవిత, బానోత్ శంకర్‌నాయక్



సీఎం సభకు వచ్చిన వాహనాలపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 27వ తేదీన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన వాహనాల యజమానులపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) బాధ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ వై.సతీష్ ఆదివారం రాత్రి తెలిపారు. సీఎం సభకు వచ్చిన వాహనాలకు ఎన్నికల నిబంధనల మేరకు అనుమతులు తీసుకోలేదని ఎంసీసీ బాధ్యులు ఫిర్యాదు చేశారని సీఐ సతీష్ తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

చిట్యాల: మండలకేంద్రంతో పాటు మండలంలోని నవాబుపేట, జూకల్, చల్లగరిగ, గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను సీఐ వేణు చందర్, ఎస్సై జంగిలి రమేష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరాల ప్రభావం ఎలా ఉందో పరిశీలించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మొదటి నుంచి వైవిధ్య ఫలితాలే

- ఆరుసార్లు కాంగ్రెస్ విజయం
- టీడీపీ, బీఆర్ఎస్, సీపీఐ రెండేసి సార్లు..
- ప్రతిసారి వినూత్న ఓటింగ్
- అంచనాలకు అందని ఫలితాలు

సాక్షి, మహబూబాబాద్: మానుకోట.. చైతన్య బాట. ఇక్కడి మట్టిలోనే చైతన్య పరిమళాలు ఉన్నాయి. నాటి సాయుధ పోరు నుంచి.. నేటి ఎన్నికల పోరు వరకు వినూత్న ఓటింగ్, ఊహించని ఫలితాలకు మానుకోట నియోజకవర్గం నిలయంగా మారుతోంది. చిల్లంచర్ల నియోజకవర్గం నుంచి వేరుపడిన తర్వాత 13 సార్లు జరిగిన ఎన్నికల్లో ఆరుదఫాలు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీతోపాటు భారత రాష్ట్ర సమితి రెండేసి పర్యాయాలు గెలుపొందాయి. 1952 ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్న సమయంలో పీడీఎఫ్, ఎస్‌సీఎఫ్‌లు చెరో సీటు గెల్చుకున్నాయి.

ఆరుసార్లు కాంగ్రెస్ విజయం

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మహబూబాబాద్ శాసనసభకు 13సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1972 నుంచి 1989 వరకు జరిగిన వరుస ఎన్నికల్లో జన్నారెడ్డి జనార్దన్ రెడ్డి ఎదురు లేని నాయకుడిగా ఐదు సార్లు గెలుపొంది శాసనభలో ప్రాతినిథ్యం వహించారు. ఇందులో నాలుగు సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగి గెలవగా.. 1983లో జరిగిన ఎన్నికల్లో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఈ నియోకవర్గం ఎస్టీ రిజర్వ్ అయింది. అప్పటి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన మాలోత్ కవిత టీడీపీ అభ్యర్థిపై గెలుపొందారు.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	వచ్చిన ఓట్లు	సమీప అభ్యర్థి	వచ్చిన ఓట్లు
1952	బి.ఎం. చందర్‌రావు(ఎస్‌సీఎఫ్)	14,575	ఎ.రాజయ్య(ఇండిపెండెంట్)	11,334
(ద్విసభ)	కన్నెకంత శ్రీనివాసరావు(పీడీఎఫ్)	26,920	ఎస్.రెడ్డి(కాంగ్రెస్)	11,252
1967	తీగల సత్యనారాయణ(సీపీఐ)	25,635	గండి మల్లికార్జున్‌రావు(కాంగ్రెస్)	22,164
1972	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	53,122	టి. సత్యనారాయణ(సీపీఐ)	10,657
1978	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	24,036	బి. బాబు(కాంగ్రెస్, ఐ)	20,995
1983	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్, ఐ)	35,728	గండు ఐలయ్య(టీడీపీ)	22,187
1985	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	38,690	రావూరి వీరయ్య(టీడీపీ)	31,006
1989	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	46,229	బండి పుల్లయ్య(సీపీఐ)	43,016
1994	బండి పుల్లయ్య(సీపీఐ)	58,797	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	48,683
1999	శ్రీరాం భద్రయ్య(టీడీపీ)	46,538	వి. రాజవర్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	34,110
2004	వేం నరేందర్‌రెడ్డి(టీడీపీ)	50,373	జె. భరత్ చంద్రారెడ్డి(జనతా)	47,110
2009	మాలోత్ కవిత(కాంగ్రెస్)	66,209	అజ్మీరా చందూలాల్(బీఆర్ఎస్)	50,842
2014	బి.శంకర్‌నాయక్(బీఆర్ఎస్)	78,370	మాలోత్ కవిత(కాంగ్రెస్)	69,055
2018	బి. శంకర్‌నాయక్(బీఆర్ఎస్)	85,397	పి.బలరాంనాయక్(కాంగ్రెస్)	71,863

టీడీపీ, బీఆర్ఎస్, సీపీఐ రెండేసి సార్లు

మొదటి నుంచి కమ్యూనిస్టుల ప్రభావం ఉన్న నియోజకవర్గం మానుకోట. ఇక్కడ చేపట్టిన ప్రజా ఉద్యమాల ఫలితంగా 1967లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ నుంచి పోటీ చేసిన తీగల సత్యనారాయణ కాంగ్రెస్ అభ్యర్థి గండి మల్లికార్జున్‌పై విజయం సాధించారు. తర్వాత ఐదు సార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి జన్నారెడ్డి జనార్దన్ రెడ్డి గెలుపొందారు. అయితే 1994లో జరిగిన ఎన్నికలో తిరిగి కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నుంచి పోటీ చేసిన బండి పుల్లయ్య గెలిచి జనార్దన్ రెడ్డి వరుస విజయాలకు అడ్డుకట్టవేశారు. అదే విధంగా 1999 ఎన్నికలో శ్రీరాంభద్రయ్య, 2004ఎన్నికల్లో వేం నరేందర్‌రెడ్డి టీడీపీ నుంచి పోటీ చేసి గెలిచారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత జరిగిన 2014, 2018ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ విజయం సాధించారు.



పాముకాటుతో బాలుడి మృతి

ములుగు రూరల్: పాము కాటుతో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా కేంద్రంలో జరిగింది. జిల్లా కేంద్రానికి చెందిన గుంజె స్వాతి, రాజు దంపతులు తమ కుమారుడు నిఖిల్ (12)తో కలిసి ఇంట్లో కింద నిద్రించారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున బాలుడి నోటి నుంచి నురుగు రావడంతో గమనించిన తల్లిదండ్రులు వెంటనే ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. గమనించిన వైద్యులు బాలుడు మృతి చెందాడని నిర్ధారించారు. కాగా, ఒక్కగానొక్క కొడుకు పాము కాటుతో మృతి చెందడంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



నిఖిల్ (ఫైల్)

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..

వర్ధన్నపేట: తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చిర్ర వెంకటయ్య (70) ఆదివారం సాయంత్రం కల్లు తీయడానికి తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో చెట్టుపై నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య కొమురమ్మ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతున్న కౌలు రైతు..

మామునూరు : పంట పెట్టుబడులు రాక, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన కౌలు రైతు దార రాజు(35), లాస్య దంపతులు 8 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో సాగుకు పెట్టిన పెట్టుబడి రాక, ఆర్థిక ఇబ్బందులతోపాటు ఇటీవల భార్య లాస్య పుట్టింటికి వెళ్లడంతో రాజు మనస్తాపానికి గురై శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి ప్రమీల హుటాహుటిన ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సహకారం అందాలి..





సమావేశంలో మాట్లాడుతున్న మహిళలు

జీవనోపాధి కోసం ప్రణాళిక ఉండాలి

- మహిళా సంక్షేమానికి మరింత కృషి చేయాలి
- 'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో కస్తూర్బా మహిళా పొదుపు సంఘం బాధ్యుల స్పష్టీకరణ

సాక్షి 'పీపుల్స్ ఎజెండా'

వ్యాపారం, ఉద్యోగం, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రాధాన్యం కల్పించడంతో పాటు మహిళా సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని నర్సంపేట కస్తూర్బా మహిళా పొదుపు సంఘం బాధ్యులు కోరారు. తెలంగాణ శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'పీపుల్స్ ఎజెండా'లో వారు తమ డిమాండ్లను రాబోయే ప్రభుత్వాల ముందుంచారు. పావలా వడ్డీ రుణాలు, అభయ హస్తం పథకానికి సహకారం అందించి నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలన్నారు. కొత్త ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం ప్రస్తుతం అమలు పరుస్తున్న పథకాలను మరింత పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. - నర్సంపేట

రుణాలు మరింత పెంచాలి



స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు మరిన్ని రుణాలు అందించాలి. రుణాలు ఎంత ఎక్కువగా అందజేస్తే అంత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అందజేస్తున్న రుణాలతో చిన్న వ్యాపారాలు చేసుకోవడానికే సరిపోతోంది.

- నల్లా తేజమ్మ, కస్తూర్బా ఎంపీఎస్ అధ్యక్షురాలు, నర్సంపేట

ప్రాధాన్య పథకాలు అమలు కావాలి



మహిళా సంక్షేమానికి ప్రాధాన్య పథకాల అమలు కావాలి. మహిళా అభివృద్ధికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తే అన్ని రంగాల్లో రాణిస్తారు. ప్రస్తుతం వ్యాపారం, ఉద్యోగం, తదితర రంగాల్లో బాగానే రాణిస్తున్నప్పటికీ నూతన ఒరవడితో కూడిన పథకాలు తీసుకువస్తే ఇంకా బాగుంటుంది.

- కల్వచర్ల ఉమ, కస్తూర్బా ఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి, నర్సంపేట

మహిళా చట్టాలు పకడ్బందీ చేయాలి



మహిళలకు సమాజంలో కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నా ఆగడాలు తగ్గడం లేదు. ప్రస్తుతం ఉన్న చట్టాలను మరింత కఠినం చేస్తేనే రక్షణ లభిస్తుంది. మహిళలను ఇబ్బందులకు గురిచేసే వారిలో భయం కలగాలంటే మరిన్ని చట్టాలు తీసుకురావాలి.

- మొగిళగాని కవిత, మహిళా సంఘం సభ్యురాలు

చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలి



ప్రభుత్వం మహిళలను వివిధ రంగాల్లో ప్రోత్సాహిస్తోంది. అయితే మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలంటే చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహాలు పెంచాలి. బ్యాంకుల ద్వారా ప్రత్యేక రుణాలు అందించాలి. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది.

- పాగుళ్ల వాణి, మహిళా సంఘం సభ్యురాలు

వడ్డీ లేని రుణాలు అందజేయాలి



మహిళలు ఏ రంగంలోనైనా రాణించడానికి ముందుకు వస్తున్నారు. ఇందుకు ప్రభుత్వాల నుంచి సహకారం కోరుకుంటున్నారు. ఇందు కోసం వడ్డీ లేని రుణాలు అందజేస్తే ఎంచుకున్న రంగంలో రాణించి ఆర్థికంగా బలోపేతం కావొచ్చు. ప్రస్తుతం ప్రభుత్వం అందజేస్తున్న రుణాలు పెంచి వడ్డీ లేకుండా చర్యలు చేపట్టాలి.

- నల్ల రజిత, మహిళా సంఘం సభ్యురాలు

రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించాలి



మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయితే రాజకీయాల్లో కూడా రాణించడానికి ఎక్కువ అవకాశాలు కల్పించాలి. తద్వారా మహిళా రక్షణకు ప్రత్యేక ఆలోచన వచ్చే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. అప్పుడే మహిళా సాధికారత లభించినట్లు.

- గన్నోజు రేణుక, మహిళా సంఘం సభ్యురాలు

ఉపాధి అవకాశాలు కల్పించాలి



ప్రభుత్వాలు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. అయితే గ్రామ, పట్టణ స్థాయికి వచ్చే సరికి అంతంతమాత్రంగానే లభిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వచ్చే ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు మరింత పెంచితే మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారు.

- మడిపెద్ది శ్రీదేవి, ప్రైవేట్ ఉపాధ్యాయిురాలు

బాలిక సంరక్షణకు కృషి చేయాలి



గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయి. వీటి నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంది. అయినా కొన్ని చోట్ల జరుగుతూనే ఉన్నాయి. వీటిని నియంత్రించడానికి గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యచరణ చేపట్టాలి. అధికారులు, ప్రజాప్రతిధులు బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

- పరావస్తు ప్రసన్న, మహిళా సంఘం సభ్యురాలు

పావలా వడ్డీ రుణాలు అందించాలి



కొందరి మహిళలకే పావలా వడ్డీ రుణాల అమలు జరుగుతోంది. అధిక శాతం మహిళలకు అందకపోవడంతో బ్యాంకులకు వడ్డీతో చెల్లించాల్సి వస్తోంది. ప్రతీ మహిళా సంఘానికి పావలా వడ్డీ రుణం అందించి ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

- బోగోజు సంధ్య, టైలర్

నిత్యావసరాలను నియంత్రించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసరాల ధరలు నియంత్రించకపోవడంతో మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించి వచ్చే ప్రభుత్వాలు నిత్యావసరాలపై ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్తే మధ్య తరగతి వాసులు ఇబ్బంది లేకుండా జీవనం కొనసాగించొచ్చు.

- నల్ల దివ్య, గృహిణి

అక్షరాస్యతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనేక మంది వివిధ కారణాలతో చదువుకోవడం లేదు. మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చేస్తున్న చర్యలు సరిపోవడంలేదు. వచ్చే ప్రభుత్వాలు మహిళలను అక్షరాస్యులుగా చేసే బాధ్యతలో మరిన్ని చర్యలు చేపట్టాలి.

- దూపటి ప్రియాంక, గృహిణి

రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి



మహిళా రక్షణ కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయి. కానీ వాటి అమలు, వినియోగంపై మహిళలకు అవగాహన లేకుండాపోతుంది. రక్షణ చట్టాలపై మహిళలకు అవగాహన పెంచడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పిస్తే ప్రయోజనం లభిస్తుంది.

- పాగుళ్ల నవ్య, మహిళ

ఎండు గంజాయి పట్టివేత

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా రైలులో తరలిస్తున్న 7 కిలోల శుద్ధి చేసిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్ర మోహన్ తెలిపారు. కాజీపేట పట్టణ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రైళ్లలో తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో పోలీసులను చూసిన నిందితులు పరారీ కాగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణంలో మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం ఉంటే 8712659020 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, సిబ్బంది ఖలీల్, రవీందర్, లాలయ్య, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

సినిమాల్లో అవకాశాలు రాలేదని యువకుడి ఆత్మహత్య

కాజీపేట: సినిమాల్లో సరైన పాత్రలు లభించడం లేదనే కారణంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు.. వడ్డేపల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం వెలుగుచూసింది. కాజీపేట సీఐ సార్ల రాజు కథనం ప్రకారం రంగారెడ్డి జిల్లా మార్తాండ నగర్ గ్రామానికి చెందిన పిల్లి సాయి ప్రకాశ్(26) పలు సినిమాల్లో చిన్న పాత్రల్లో నటించాడు. అయితే ఇప్పటి వరకూ సరైన అవకాశాలు దక్కలేదు. ఈ క్రమంలో 20 రోజుల క్రితం భద్రాచలం వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పాడు. అయితే భద్రాచలం వెళ్లకుండా హనుమకొండ జిల్లా కేంద్రానికి చేరుకుని హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంలో స్థిరపడే అవకాశం రాలేదనే మనస్తాపంతో ఈ నెల 28న వడ్డేపల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు సీఐ రాజు వివరించారు.



సాయి ప్రకాశ్ (ఫైల్)

పురుగుల మందు తాగి వ్యక్తి..

రఘునాథపల్లి : కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని కోమళ్లలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోమళ్లకు చెందిన బండి స్వామి(28) గీతవృత్తితో పాటు కూలీ పనులకు వెళ్తుంటాడు. కొన్నాళ్లుగా స్వామి మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. కాగా, శనివారం అతిగా మద్యం తాగడంతో భార్య రాధిక స్వామిని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన స్వామి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

స్వామి మృతి సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కోమళ్లకు చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మేకల వరలక్ష్మి, లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, కోమళ్ల రవిగౌడ్ తదితరులు ఉన్నారు.